



# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్

## కొండెక్కిన దీపాల కొలువు

ఇరుగింటి దీపం, పొరుగింటి దీపం, ఎగవింటి దీపం, దిగవింటి దీపం, మిద్దింటి దీపం, గుడిసింటి దీపం ఒక్కొక్కటిగా కొండెక్కుతున్నాయి. మూలస్తానమ్మ గుడి కాడికి పొయ్యి కొలువుతీరతా వుండాయి.

ఆ యాపమాను ఎప్పుడో నరులుపుట్టినప్పుడు పుట్టింది. పురులు తిరిగిన కొమ్మల్ని ఆకాశానికి ఎత్తి, కొనల్ని కిందికి దించింది. ఆ చీకట్లో చూస్తావుంటే రాచ్చసుడు నిలబడి చేతుల్ని వూపతా వున్నెట్టుండాది. ఆ నరమాను కింద వుండాది మూలస్తానమ్మ గుడి.

ఎప్పుడో ఏకిలదొరల కాలంలో కట్టిన గుడి. పాడుపడిపోయిండాది. పాములు, తొండాకులు చేరిపోయినాయి. తీంట్రతీగలు పొదలు పొదలుగా గుడిని అల్లుకుని కప్పేసినాయి. గర్భగుడి మాత్తరం పడిపోలేదు. సుద్దమట్టితో అలికిన గోడలు నెర్రెలు చీలినాయి. గుడిలో విగ్రహం లేదు. నడుము ఎత్తు గుండుండాది. ఆ గుండుకి పసుపుకుంకాలు పూసినారు.

గుండుకి ఎదురుగా శూలాలు గుచ్చుండారు. ఆ శూలాలకి ఏవో ముడుపులు కట్టుండారు

గుడి ముందర కత్తి పైకెత్తి, గుడ్లురుమతా పోతురాజు ఆయమ్మకి కాపలా కాస్తావుండాడు.

ఆ యాపచెట్టు కింద దీపాలు గాలికి రెపరెపలాడతా వుంటే నింగిలోని చుక్కలు నేలకి దిగినట్టుండాది.

కొన్ని దీపాలు మూలస్తానమ్మ గుడి అరుగుమింద కూర్చోని దాయాలు ఆడుకుంటా వుండాయి. కొన్ని దీపాలు గుడిముందర కోలాటమేస్తా వుండాయి. కొన్ని దీపాలు వెన్నెలకుప్పాట ఆడుకుంటా వుండాయి. కొన్ని దీపాలు యాపమాను కొమ్మలికి ఉయ్యాల ఊగతా వుండాయి.

''గూట్లో రూపాయ్! నీ మొగుడు సిపాయ్!!
నీ మొగుడు సిపాయ్! గూట్లో రూపాయ్!!''
చేతులు పట్టుకుని కొన్ని దీపాలు అప్పాలు తిరుగుతున్నాయి.

కొన్ని దీపాలు గుడి మెట్లమింద కూర్చోని అరువులు చేసుకుంటా వుండాయి.

దీపాల ఆనందం అంతా ఇంతా గాదు!

మూలస్తానమ్మ గుడికాడ కేళీ ఇలాసంగా వుండాది.

* * *

రాతిమింద పడిన దాయాలు గళ్ళున మోగినాయి.

''దాయం ఆరు. చచ్చింది గొర్రె!'' అని ఆరోగడిలోని కాయని చంపింది మిద్దింటి దీపం.

గుడిసింటి దీపం మొగం మాడిపోయింది.

మళ్ళీ దాయాలు కుదిలించి సంతోషంగా వేసింది మిద్దింటి దీపం. గళ్ళున మోగి దాయం పన్నెండు పడింది. కాయని ముందుకు జరపబోయి ఆపింది. ఎందుకంటే గట్టాలో గుడిసింటి దీపం కాయ వుండాది. దాన్ని దాటుకోని ఐదో గడిలోకి వెళ్ళాలి.

''రారా... నీ పని చెప్తా!'' అంటా దాయాలు తీసుకునింది గుడిసింటి దీపం.

చేసేదేమీ లేక గట్టాకి అవతల ఐదో గడిలో కాయని పెట్టింది పెద్దింటి దీపం.

గుడిసింటి దీపం చేతిలో నుంచి దాయాలు కిందపడినాయి.

''దాయం ఐదు. చచ్చిపీనిగైంది'' అని సంతోషంతో గట్టిగా అరస్తా, ఐదో గడిలోని కాయని కసిగా చంపింది గుడిసింటి దీపం.

''ఏమే.. పందెంలో ఏం ఒడ్డారు?'' అడిగింది పక్కన కూర్చుని ఆట చూస్తా వుండే దీపం.

''పెళ్ళాన్ని, రాజ్జాన్ని ఒడ్డడానికి మనమేమైనా నరులమా!'' అనింది పెద్దింటి దీపం.

''ఒడ్డకపోతే ఆటలో పట్టేముంటుంది రుచిపచేముంటుంది. ఒట్టి ఆట ఓటు కుండా ఒగటే'' అని మూతి మూరడు పొడుగు తిప్పి అనింది ఆట చూస్తా వుండే దీపం.

''ఇట్లానే మొన్న మా యజమానుడు పేకాటలో అన్నీ ఒడ్డేస్తే, పెళ్ళాం ఒళ్ళు కాల్చుకుని పాణాలు తీసుకోబోయింది'' అనింది దాయాలు చేతిలో కుదిలిస్తా.

''అయ్యో పాపం! అంత ఘోరం జరిగిందా మీ ఇంట్లో?'' అంటా కనుగుడ్లను పెద్దవి చేసింది ఆట చూస్తా వుండే దీపం.

దాయాలు వేయడం ఆపి, ''ఏం చెప్పమంటావులే అక్కా! ఆ ఘోరం. తలచుకుంటేనే కడుపులో తిప్పి వాంతి కొచ్చేట్టుండాది. పేకాట ఆడి ఆస్తులన్నీ ఆరతి కప్పూరం పట్టేసినాడు. పెళ్ళాం మెళ్ళోని పుస్తెలతో సహా ఒడ్డేసినాడు. ఇంట్లో దరిద్రం. వీధిలో పరువు పోయింది. పాపం ఏం చేస్తుంది ఆ ఇల్లాలు? కొంగుని నా మిందేసింది. మంట చీరకంటుకునింది. చూస్తా చూస్తా వుండగానే నా కండ్లముందే బూడిదైపోతావుండాది. సెగకి తట్టుకోలేక అరుస్తా వుండాది. ఆ అరుపులు విని ఇరుగింటి, పొరుగింటి వాళ్ళొచ్చి మంటలార్పినారు. కాలిన గాయాలకి నవనీతం పూసి, అరిటాకుల్లో దొల్లించినారు.

''మంటమ్మా! మంట తల్లీ'' అని అరుస్తుంది. కేకలు పెడుతుంది.

''ఆ దీపాన్ని ఆర్పేయండి. ఆ ఎలతర సూదులతో పొడిసినట్టుడాది'' అని అరిస్తే, నన్ను కొండెక్కించారు. మనమేమో దేవలోకం నుంచి ఈ నరుల ఇళ్ళల్లో వెలుగుని నింపేదానికి వస్తామా! ఈళ్ళేమో మనకి పాపాలని అంటగట్టి, చీకట్లోకి జారిపోతారు '' అనింది కళ్ళనీళ్ళు పెట్టుకుని మిద్దింటి దీపం.

''అయ్యయ్యో! ఎంత దుక్కం తల్లీ నీది '' అనింది ఆట చూస్తా వుండే దీపం.

''మీ ఇంట్లో అట్లా జరిగిందా! మా ఇంట్లో ఏం జరిగిందో తెలుసా?'' అనింది గుడిసింటి దీపం.

''ఏం జరిగింది ఏవిటమ్మా? దుక్కమైతే వొద్దు తల్లీ! ఇప్పటికే గుండె చెరువైంది'' అనింది ఆట చూస్తావుండే దీపం.

''దుక్కం కాదు! సంతోషకరమైన విషయమే జరిగింది'' చెప్పింది గుడిసింటి దీపం.

''అయితే చెప్పమ్మా, గుండె బరువు దించుకుంటాను'' అనింది ఆట చూస్తా వుండే దీపం.

''మాది గుడిసిల్లు. దరిద్రం తాండవిస్తా వున్నింది. ఆ ఇంటి పిలగాడు నా వెలుగులో కూర్చుని నిష్టగా సదువుకొనేవోడు. పిలగాడ్ని పెద్ద పెద్ద సదువులు సదివించేదానికి చేతిలో దుడ్డు లేదు. వాడి సదువుకోసం, వాళ్ళమ్మా నాయన అప్పులు చేసినారు. తల్లి అయితే మెళ్ళోని పుస్తెలు గూడా అమ్మేసింది. పస్తులున్నారు. ఎలాగైతేనేం! ఆ పిలగాడు బాగా సదివి, కష్టపడి ఒక్కొక్క మెట్టే పైకెక్కినాడు. పెద్ద ఆఫీసరైపోయినాడు.

ఉజ్జోగంలో చేరిన రోజొచ్చి నాతో ఏమన్నాడో తెలుసా? నీ వెలుగులో సదువుకున్నాను. నిన్ను అంటుకుని నా మనసులో జ్ఞానదీపాన్ని వెలిగించుకున్నాను. నీ మేలు ఎప్పటికీ మరచిపోలేను అని చెప్పి రాగి కాణీని నా చేతుల్లో పెట్టి దండం పెట్టుకున్నాడు'' అని కండ్ల నిండుకు నీళ్ళు పెట్టుకునింది గుడిసింటి దీపం.

ఆ మాటకి అక్కడున్న దీపాల కళ్ళు చెమ్మగిల్లాయి.

* * *

ఉయ్యాల్లో ఇరుగింటి దీపం ఊగుతూ వుంటే, పొరుగింటి దీపం ఊపుతోంది.

''ఊపమ్మా ఊపు! ఇంగా గట్టిగా ఊపు'' అనింది ఇరుగింటి దీపం.

వెనక్కి లాగి వొదిలింది పొరుగింటి దీపం.

ఉయ్యాల కొమ్మల్ని తాకి వచ్చింది.

''ఊపమ్మా ఊపు! ఆ చుక్కల్ని అందుకోవాలి'' అనింది ఇరుగింటి దీపం.

ఇంకా వెనక్కి లాగి, గట్టిగా ఊపింది. ఈసారి చుక్కల్ని తాకింది ఉయ్యాల.

ఇరుగింటి దీపానికి కళ్ళు తిరిగినట్టనిపించింది.

''అమ్మో కళ్ళు తిరుగుతున్నాయి. ఆపవే భయంగా వుంది'' అని అరిచింది.

### ఆ ఒక్కటి తప్పు



బాలీవుడ్ కౌబాయ్ అక్షయ్ కుమార్‌కి గుర్రపుస్వారీ అంటే చాలా ఇష్టం. గత 15 ఏళ్లుగా ఎలాంటి అలోపతి మెడిసిన్ అతని బాడీకి అవసరం రాలేదు. ఎప్పుడైనా అవసరమొచ్చినా ఆయుర్వేదంతో సరిపెడతాడు. శరీరాన్ని ఒక దేవాలయంలా చూసుకోవాలనేదే అక్షయ్ ఫిలాసఫీ. అతనికి ఎలాంటి దురలవాట్లు లేవట. మందు తాగడు, స్మోక్ చేయడు. అమ్మాయిలతో మాత్రం తిరుగుతాడు. దాన్ని దురలవాటని అక్షయ్ అనుకోవడం లేదు.

నవ్వుతూ ఉయ్యాలని పట్టుకునింది పొరుగింటి దీపం.

''అంత గట్టిగానా ఊపడం! కొంచెమైతే కిందపడిపోయిందును'' అనింది ఉయ్యాలలో నుంచి దిగుతూ.

''నువ్వే గదా చుక్కల్ని అందుకోవాలన్నావు?''

''ఏదో సంతోషంలో ఊపమంటే ఊపెయ్యడమేనా? భయంతో సంతోషమంతా నీరుగారిపొయింది'' అనింది చిన్నబుచ్చుకుంటూ.

''ఏమిటమ్మా ఆ సంతోషం? మాకు చెపితే మేము సంతోషిస్తాం గదా!'' అని అడిగింది పొరుగింటి దీపం.

''ఈరోజు మా ఇంట్లో ఓ నలుసు ఊపిరి పోసుకునింది. ఆ బిడ్డ ఎంత అందంగా వుందనుకున్నావు? పున్నమి నాటి చెందమామల బొద్దుగా వుంది. బుగ్గ చిదిమి ముద్దు పెట్టుకోవాలనిపించింది''

''అవునా!'' అనింది ఆశ్చర్యపడిపోతా పొరుగింటి దీపం.

''అవునా ఏంటే! ఆ చెందమామ వెలుగు ముందు, నా వెలుగు చిన్నబోయింది తెలుసా!'' అంది సంతోషంగా ఇరుగింటి దీపం.

''ఆ సంతోషం నీకేనా? నాకూ దక్కొద్దూ! ఇప్పుడు ఊగడం నా వంతు'' అని ఉయ్యాల ఎక్కింది పొరుగింటి దీపం.

ఇరుగింటి దీపం ఊపుతోంది.

''ఊపమ్మా ఊపు! గట్టిగా ఊపు!! ఆ చుక్కల్ని అందుకోవాలి'' అంటూ గలగలా నవ్వుతోంది పొరుగింటి దీపం.

* * *

గుడి మెట్లమీద కూర్చోని అరువులు చేసుకుంటా వుండాయి దీపాలు.

ఇంతలో,

ఆకాశంలో వెలుగుని విరజిమ్ముతూ చుక్కరాలిపోతూ కనిపించింది.

''ఒసేయ్.. చూడు చూడు! ఆకాశంలో చుక్క రాలిపోతా వుండాది. ఆ దిక్కునెవడో సచ్చిపోయింటాడు'' అనింది ఎగవింటి దీపం.

''అబ్బా! సావుమాట ఎత్తకే. ఇప్పుడే పీనిగినెత్తి వస్తావుండాను'' అనింది దిగవింటి దీపం మొగం చిట్లించి.

''ఎవరే సచ్చిపోయింది? ఎంత వయసుంటుంది?'' అని అడిగింది పక్కన కూర్చున్న దీపం.

''నూరేళ్ళపైనే వుంటుంది. ఎంత గోర్చి గోర్చి సచ్చిపోయినాడనుకున్నావు?వుచ్చాపీతిలో మునిగి తేలినాడు. కీళ్ళ దెగ్గర పాసిపొయ్యి పురుగులు పడిపాయినాయి'' అని చెపుతున్నప్పుడు మిగతా దీపాలు అసింకంగా మొగాలు చిట్లించినాయి.

''ఇంట్లో గొబ్బు అని ఈదిలో చింతచెట్టు కింద పడేసినారు. ఒకటా రెండా ఎనిమిది నెలలు గోర్చినాడు. నన్ను వెలిగిస్తానే తన బాధనంతా నాతో మొరపెట్టుకునేవాడు. నన్ను దేవుడు ఎప్పుడు కొండెక్కిస్తాడో అని వలవలా ఏడ్చేవాడు. ఊపిరిపొయ్యేటప్పుడు ఎంత సంతోషించినాడనుకున్నావు? ఆ ఆనందాన్ని ఎలా వర్ణించును? మాటల్లో చెప్పలేనే తల్లీ!'' అని చెప్పింది దిగవింటి దీపం.

ఆర్పేసినట్టు దీపాల మొగాలు పొగచూరిపొయినాయి.

మొనుసును వైరాగ్యం ముసురుకునింది.

ఇంతలో,

వాటి వైరాగ్యాన్ని కుండబద్దలు కొడతా,

రెండు దీపాలు చేయిచేయి పట్టుకుని చిలకల్లా కిలకిలా నవ్వతా వచ్చినాయి.

వాటిని చూసి గుడిమెట్లమింద కూర్చోనుండే దీపాలు గూడా నవ్వినాయి.

''ఏమే నా సవతులాల! ఎందుకే నవ్వతా వుండారు?'' అనింది గుడి మెట్లమింద కూర్చోనుండే రాశింటి దీపం.

''దీనింట్లో తొలిరాత్తిరి పండగ జరిగింది. ఆ ముచ్చట్లు చెప్పతా వుంటే నవ్వాగలేదమ్మా!'' అంటూ ఆ రెండు దీపాలు, మిగతా దీపాలతో పాటూ గుడి మెట్లమీద కూర్చున్నాయి.

''ఏమే వగలాడి! ఆ ముచ్చట్లు ఏవో చెపితే మేమూ నవ్వుతాం గదా!'' అనింది రాశింటి దీపం.

పరుపుమింద కూర్చుని ఎప్పుడెప్పుడు పిల్లది వస్తుందా అని ఎదురు చూస్తా వుండాడు పిలగాడు. తలుపు చప్పుడైతే తలెత్తి చూసినాడు. లోపలికి వచ్చిన పిల్ల జింక పిల్లలా బెదిరిపోయింది. క్షణంలో వేసిన తలుపు తీసి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

ఆ దీపం చెప్పబోయి నవ్వి వూరుకుంది.

''ఒసి నీ సిగ్గు చిమిడిపోనూ! అంత సిగ్గయితే ఎట్లానే?'' అనింది ఎగవింటి దీపం.

గాలికి మెల్లగా రెపరెపలాడి చెప్పడం ఆరంభించింది ఆ దీపం.

''పరుపుమింద కూర్చుని ఎప్పుడెప్పుడు పిల్లది వస్తుందా అని ఎదురు చూస్తా వుండాడు పిలగాడు. తలుపు చప్పుడైతే తలెత్తి చూసినాడు. లోపలికి వచ్చిన పిల్ల జింక పిల్లలా బెదిరిపోయింది. క్షణంలో వేసిన తలుపు తీసి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

పిలగాడు నిశ్చలకపొయినాడు.

పరిగెత్తుకుంటా వాళ్ళమ్మ దెగ్గిరికి పొయింది.

''అమ్మా నాకు భయంగా వుండాది. నేను పోనమ్మా'' అనింది.

వాళ్ళమ్మ నవ్వి, ''తప్పమ్మా... అట్లా అనగూడదు'' అంటా బుగ్గ చిదిమింది.

తలుపు దగ్గిరికి తీసుకోనొచ్చి, ''వెళ్ళమ్మా.. నా తల్లిగదూ!'' అనింది.

''ఊహు.. నేను పోను'' అనింది.

''మెట్టుతో కొడతాను. ముందు లోపలికి పో'' అని కోపంగా కసురుకునింది.

''ఆ మాటతో తలుపుతీసి, 'దఢామని' వేసి లోపలికొచ్చింది''.

పిలగాడి మొగంలో సంతోషం పాలుపొంగినట్టు పొంగింది.

పాలగలాసు అక్కడ పెట్టి కూర్చునింది. పిలగాడికి అన్నీ తొందరే! పాలన్నా తాక్కుండానే, ఆ పిల్లదాని పెదాలని అందుకోవాలని చూసినాడు.

మిగతా దీపాలకి ఆ మాటతో వొళ్ళు పులకరించింది.

''ఆ పిల్లదానికేమో చెమటలు పట్టేసినాయి. గట్టిగా కళ్ళు మూసుకునింది. పెదాలు సన్నగా వొణకతా వుండాయి.''

దీపాలు ఆ మాటకి కిలకిలా నవ్వినాయి.

''పనస తొనలని అందుకున్నట్టు వణికే పెదాలని అందుకున్నాడు. ఆ పిల్లదాని నడుము మీద చేతులు వేసినాడు.''

''చల్లని చేతులు తగిలేసరికి వొళ్ళంతా పులకరింత''

నడుము మీద ఎవరో చేతిని వేసినట్టనిపించి ఒగ దీపం ఉలిక్కిపడి చూసి, తనలో తానె నవ్వుకొనింది.

''హరివిల్లు లాంటి నడుమును సంధిస్తున్నాడు. ఆ పిలగాడి చేతుల్లో ఆ పిల్ల పూలబాణమైంది. నాకైతే సచ్చేంత సిగ్గనిపించింది అనుకో!'' అని చెప్పడం ఆపింది.

''మల్లా... చెప్పు చెప్పు'' తొందరపడిపోతూ దీపాలన్నీ ఒక్కసారిగా అడిగినాయి.

''ఏం చెప్పమంటారమ్మా! సిగ్గుతో సచ్చిపోతుంటేనూ!! నన్ను ఆర్పేయనన్నా ఆర్పరే! నా ముందే సరసాలు. ఆ పిల్ల భయంతో అంతగా వణికిపోయిందా! ఆ తర్వాత ఆ పిలగాడ్ని ఎంత రెచ్చగొట్టింది అనుకున్నావు?'' అని పలపలా పూలు రాలినట్టు నవ్వింది.

మిగిలిన దీపాలు కూడా నవ్వినాయి.

* * *

వీళ్ళు ఇట్లా మాట్లాడుకుంటా వుండగానే పెద్దింటి దీపం వచ్చేసింది. ఆ దీపాన్ని చూసి ఉయ్యాలూగే దీపాలు, దాయాలు ఆడే దీపాలు, కోలాటమేస్తా వుండే దీపాలు అన్నీ వచ్చి గుమికూడినాయి.

''ఏమమ్మా అందరూ వచ్చేసినట్టేనా?'' అని అడిగింది.

మొగాలు చూసుకొన్నాయి దీపాలు.

''ఆ గోపినింటి దీపం వచ్చేస్తే అందరూ వచ్చేసినట్టే!'' అనింది రాశింటి దీపం.

''గోపినింటి దీపం ఇంగా రాలేదా? గుడ్డిసుక్క సూడు ఎంతపైకెక్కిందో. ఇంగా రాకపోతే ఎట్లానే! '' అనింది విసుగ్గా పెద్దింటి దీపం.

''ఏమోనమ్మా ఇంగా కొండెక్కలేదు. ఏమైందో ఏమో!'' అనింది రాశింటి దీపం.

''అది రాకుండా మనమెట్లా బోతాం దేవలోకానికి. దాన్ని వదిలేసిపోతే దేవుడు వూరుకుంటాడా? అగ్గిమీద గుగ్గిలమైపోడూ'' అనింది పెద్దింటి దీపం.

దీపాలన్నీ ఆ గుడి మెట్లమీదనే కూర్చుని గోపినింటి దీపంకోసం ఎదురుచూస్తా వుండాయి.

★